వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రావు, డీఐ మధుసూదన్ తదితరులు

మాటలతో మభ్యపెట్టి..

ఆభరణాల తస్కరణ..నిందితుడి అరెస్టు

కేపీహెచ్‌బీ కాలనీ, ఏప్రిల్ 25 : క్రికెట్ బెట్టింగ్.. ఆన్‌లైన్ రమ్మీ గేమ్‌తో పాటు మద్యానికి అలవాటు పడి, డబ్బుల కోసం దొంగతనాలు చేస్తున్న ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. గురువారం కేపీహెచ్‌బీ కాలనీ పీఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్ రావు, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్ రావు, డీఐ మధుసూదన్ వివరాలను వెల్లడించారు. భువనగిరి జిల్లాకు చెందిన బానోతు భాస్కర్ అలియాస్ శంకర్ (21) బిల్డింగ్ మెటీరియల్ సరఫరా చేస్తాడు. క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ రమ్మీ గేమ్ ఆడుతూ.. మద్యానికి అలవాటు పడి, డబ్బుల కోసం దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. ఈ నెల 3న కేపీహెచ్‌బీ కాలనీలోని లలితా జువెల్లరీ దుకాణానికి బంగారు గొలుసు కొనుగోలు చేసేందుకు కస్టమర్‌గా వెళ్లాడు. సేల్స్‌గర్ల్ నాగలక్ష్మిని కలిసి ఓ గొలుసు నచ్చిందని, ధర ఎంతని అడిగి.. తన మాయ మాటలతో ఆమెను బురిడీ కొట్టించి, ఆ దుకాణంలోని 28.405 గ్రాముల బంగారు గొలుసును తస్కరించి, పారిపోయాడు. కేపీహెచ్‌బీ కాలనీ పీఎస్ పరిధిలో రెండు చోట్ల, పంజాగుట్ట, మహంకాళి, నిర్మల్, మిర్యాలగూడ, మక్తల్, చైతన్యపురి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎనిమిది దొంగతనాలకు పాల్పడి, తప్పించుకుని తిరుగుతూ.. చివరకు పోలీసులకు చిక్కాడు. కేపీహెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగిలించిన 28.405 గ్రాముల బంగారు గొలుసుతో పాటు 8 పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగిలించిన 151.83 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. గతంలో కూడా నిందితుడు శంకర్ రెండు చోరీలకు పాల్పడి పోలీసులకు చిక్కాడు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన క్రైం బృందాన్ని ఏసీపీ అభినందించాడు.

నేటి నుంచి జింఖానాలో బాంబే సర్కస్

కంటోన్మెంట్, ఏప్రిల్ 25 : సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో శుక్రవారం నుంచి ప్రఖ్యాత గ్రేట్ బాంబే సర్కస్‌ను ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు ఇలియాస్ ఖాన్ తెలిపారు. గురువారం జింఖానా మైదానంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను తెలిపారు. బాంబే సర్కస్‌లో ప్రపంచ ప్రసిద్ధ ఇథియోపియన్ డయాబోలో, స్వింగింగ్ జిమ్ విన్యాసాలు, కంటార్షన్, రోలర్ స్కేటింగ్ వంటి అద్భుతమైన ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. రోజుకు మూడు షోలు ఉంటాయని, 45 రోజుల వరకు ఈ ప్రదర్శనలు కొనసాగుతాయన్నారు. అన్ని వయస్సుల ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా, వేసవి సెలవుల సందర్భంగా ప్రత్యేక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో సిబ్బంది ఉన్నికృష్ణ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ డీసీపీగా స్నేహా మెహ్రా

సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): సౌత్‌జోన్ డీసీపీగా స్నేహా మెహ్రాను నియమిస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం ఉదయం 11 గంటల వరకు బాధ్యతలు చేపట్టి, ఎన్నికల కమిషన్‌కు నివేదిక పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సౌత్‌జోన్ డీసీపీగా పనిచేసిన సాయి చైతన్యపై ఎన్నికల కమిషన్‌కు వచ్చిన ఫిర్యాదులతో ఆయనను బదిలీ చేసిన విషయం తెలిసిందే. కాగా, సౌత్‌జోన్ డీసీపీగా నియమితులైన స్నేహా మెహ్రా గతంలో సీసీఎస్ సైబర్‌క్రైమ్స్ డీసీపీగా పనిచేశారు.

ఎయిర్‌పోర్ట్ నుంచి ఇంటికొచ్చేసరికి..

బంజారాహిల్స్, ఏప్రిల్ 25: ఎయిర్‌పోర్ట్ నుంచి ఇంటికి వచ్చేసరికి లగేజీలో దాచిన రూ.కోటి విలువైన వజ్రాభరణాలు మాయమయ్యాయి. ఈ ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్‌లోని నవ నిర్మాణనగర్‌కు చెందిన బాబ్జీ భాగవతుల విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి. రెండు నెలల కిందట భార్యతో కలిసి బెంగళూరులో ఉంటున్న కుమార్తె వద్దకు వెళ్లారు. ఈ నెల 20న విమానంలో బెంగళూరు నుంచి నగరానికి వచ్చారు. రెండు లగేజీ బ్యాగులతో పాటు ట్యాక్సీలో ఇంటికి వచ్చారు.

కాగా, నాలుగు రోజుల తర్వాత లగేజీని ఓపెన్ చేసి చూడగా.. బ్యాగులో ఉండాల్సిన మూడు వజ్రాల నెక్లెస్‌లు, మూడు వజ్రాల చెవి రింగులు కనిపించలేదు. తాము ఎయిర్ పోర్ట్ నుంచి వచ్చిన ట్యాక్సీ డ్రైవర్ లగేజీని దించే క్రమంలో ఆభరణాలను తస్కరించి ఉండొచ్చనే అనుమానం వ్యక్తం చేస్తూ గురువారం బాబ్జీ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఐపీసీ 379 సెక్షన్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆత్మహత్య చేసుకోవద్దు

తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్

సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): పరీక్షల్లో తప్పిన విద్యార్థులు ఇటీవల ఆత్మహత్యలకు పాల్పడుతుండటం బాధాకరమని తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు మోత్కూరి రామచంద్రం అన్నారు. జీవితంలో వైఫల్యాలను తట్టుకోవడం నేర్చుకుంటేనే అనుకున్న లక్ష్యం నెరవేర్చుకోగలమని చెప్పారు. ఎవరు కూడా ఆత్మహత్యకు పాల్పడకూడదని తెలిపారు. తల్లిదండ్రులు విద్యార్థులకు అండగా నిలవాలని సూచించారు. వారిలో ఆత్మస్థైర్యం నింపాలన్నారు. ఒత్తిడిని అధిగమించేందుకు తెలంగాణ సైకాలజిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా కౌన్సెలింగ్ అందిస్తున్నామన్నారు. ఎవరైనా విద్యార్థులు ఆందోళనకు గురైతే తమను సంప్రదించాలని, వారికి కౌన్సెలింగ్ ఇస్తామని చెప్పారు. 9908987770, 9533660938, 9553484643 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఉప్పల్ స్టేడియంలో బ్లాక్ టికెట్లు..

ఉప్పల్, ఏప్రిల్ 25 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఐపీఎల్ టికెట్లను బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉప్పల్ క్రికెట్ స్టేడియం ప్రాంతంలో ఆందోళన చేపట్టారు. ఈ మేరకు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఉద్రిక్తత నెలకొంది. ఆందోళన చేస్తున్న నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఐపీఎల్ టికెట్లు బ్లాక్‌లో విక్రయిస్తున్నారని పేర్కొంటూ పోలీసులకు యూత్ కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు.

సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు

ఒంటరిగా వెళ్తుంటే బలవంతంగా లాక్కెళ్లి..

మూసాపేట, ఏప్రిల్ 25: మహిళపై లైంగికదాడికి పాల్పడి, ఆ తర్వాత హత్య చేసిన నిందితులను కూకట్‌పల్లి పోలీసులు గురువారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కూకట్‌పల్లి పీఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ శ్రీనివాసరావు వివరాలను వెల్లడించారు. ఈ నెల 21న తెల్లవారు జామున కూకట్‌పల్లి వై జంక్షన్‌లోని ఓ భవనం సెల్లారులోని షట్టర్ ముందు గుర్తు తెలియని మహిళ(45)పై ఇద్దరు యువకులు లైంగికదాడికి పాల్పడి, హత్య చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. రెండు బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితుల ఆచూకీ తెలుసుకున్నారు. నిందితులిద్దరిని సంగారెడ్డిలో అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి... బీహార్‌కు చెందిన నితీష్ కుమార్(24), మరో నిందితుడు మైనర్. వీరిద్దరూ సంగారెడ్డిలోని తిరుమల బార్ అండ్ రెస్టారెంట్‌లో వేటర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 20న బీహార్‌కు వెళ్తున్న తమ స్నేహితుడిని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో దించి, అక్కడి నుంచి బైక్‌పై సంగారెడ్డికి బయలుదేరారు. మార్గమధ్యలో ప్రశాంత్‌నగర్‌లో టీ తాగడానికి ఆగారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న వారికి అటుగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళ కనిపించింది. ఆమెను గమనించి స్థానికంగా ఉన్న ఓ భవనం సెల్లారులోకి బలవంతంగా లాక్కెళ్లారు. ఆమెపై లైంగిక దాడికి ప్రయత్నించడంతో ఆమె ప్రతిఘటించింది. దీంతో ఆమె తలను నేలకు బలంగా కొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయి, మృతిచెంది. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు బైక్ నంబర్, సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను సంగారెడ్డిలో గుర్తించి, అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్, డీఐ వెంకన్న, ఎస్సైలు రామకృష్ణ, ఆర్.ప్రేమ్‌సాగర్, జి.చంద్రకాంత్, ఇంద్రసేనారెడ్డి, కానిస్టేబుళ్లు ఎం.నవీన్, జయంత్, రాంచందర్, ఎండీ షకీల్‌ను ఏసీపీ అభినందించారు.

ఫెడెక్స్ కొరియర్‌లో డ్రగ్స్ అంటూ..

సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): మీ పేరుతో వచ్చిన ఫెడెక్స్ కొరియర్‌లో డ్రగ్స్, గడువు తీరిన ఏడు పాస్‌పోర్టులు ఉన్నాయంటూ ముంబై సైబర్‌క్రైమ్ ఆఫీసర్స్ పేరుతో బెదిరించిన సైబర్‌నేరగాళ్లు ఓ మాజీ ఉద్యోగి నుంచి ఆన్‌లైన్ ద్వారా రూ.50 లక్షలు దోచేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన బాధితుడికి ఓ కాల్ వచ్చింది. ముంబై సైబర్ క్రైమ్ ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నట్టు చెప్పారు. మీరు వెంటనే వీడియో కాల్‌లోకి రావాలంటూ చెప్పి, స్కైప్‌లో వీడియో కాల్ చేశారు. మీ పేరుతో వచ్చిన పార్సిల్‌కు మీ ఆధార్ కార్డు, మొబైల్ నంబర్లు లింక్ అయి ఉన్నాయి, అందులో డ్రగ్స్ ఉన్నాయంటూ బెదిరించారు. మా విచారణకు మీరు సహకరించకపోతే వెంటనే హైదరాబాద్‌లో ఉండే పోలీసులు వచ్చి మిమ్మల్ని అరెస్ట్ చేస్తారంటూ భయపెట్టారు. మీ పేరుతో 20 బ్యాంకు ఖాతాలు ఉన్నాయని, అన్నింటికి ఈ ఆధారే ఉపయోగించాలంటూ స్కైప్‌లో మాట్లాడారు. మీ వద్ద ఉన్న బ్యాంకు ఖాతాల వివరాలు చెప్పండంటూ బాధితుడి వద్ద నుంచి హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాల వివరాలను తీసుకున్నారు. ఆ బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ. 49,35,134 నగదును నేరగాళ్లు తమ ఖాతాల్లో బదిలీ చేసుకున్నారు. కేసు విచారణ జరుగుతున్నదని, డబ్బు తిరిగి మీకే ఇచ్చేస్తామంటూ నమ్మించి, ఆ డబ్బులన్ని కాజేశారు. ఆ షాక్ నుంచి తేరుకున్న బాధితుడు సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పెండ్లి కోసం వచ్చి కటకటాలపాలు

జూబ్లీహిల్స్ ప్రమాదంలో ఎన్ఆర్ఐకి రిమాండ్

బంజారాహిల్స్, ఏప్రిల్ 25 : స్నేహితుడి పెండ్లి కోసం విదేశాల నుంచి నగరానికి వచ్చిన ఓ ఎన్ఆర్ఐ జూబ్లీహిల్స్‌లో జరిగిన కారు బీభత్సం కేసులో కటకటాలపాలయ్యాడు. అతడితో పాటు అదే కారులో ప్రయాణిస్తున్న స్నేహితులకు బెయిల్ లభించింది. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నం. 45లో నివసించే చలసాని అవినాశ్ అనే ఎన్ఆర్ఐ సోదరుడి వివాహానికి అమెరికాలో నివాసముంటున్న టార్గెట్ సెక్యూరిటీ సంస్థ సీఈవో ఈతెన్ వెంకటేశ్ (23), దుబాయిలో ఉంటున్న సషా (23), జర్మనీకి చెందిన మ్యాక్మిలన్ హెన్నీ రాడింగర్ (23), అమెరికాలో నివాసముండే సాయిప్రీతం కాసం (23) నాలుగు రోజుల కిందట నగరానికి వచ్చారు. పార్క్ హయత్‌లో బస చేసిన నలుగురు స్నేహితులతో కలిసి చలసాని అవినాశ్ జూబ్లీహిల్స్‌లోని కారా పబ్‌లో మంగళవారం జరిగిన పార్టీకి హాజరయ్యారు. బుధవారం తెల్లవారుజాము 2.45 గంటల వరకు పార్టీలో మద్యం సేవించిన తర్వాత అవినాశ్ కుటుంబానికి చెందిన కారులో పార్క్ హయత్‌కు బయలుదేరారు. వెంకటేశ్ కారు నడుపుతూ విపరీతమైన వేగంతో వస్తుండగా, కారు అదుపుతప్పి బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో కారు నడిపిన వెంకటేశ్‌తోపాటు కారులో ఉన్న వారందరినీ ఐపీసీ సెక్షన్ 308, 279, 336తో పాటు పీడీపీపీ యాక్ట్ కింద నిందితులుగా చేర్చిన జూబ్లీహిల్స్ పోలీసులు.. వారందరినీ గురువారం నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. కారు నడిపిన వెంకటేశ్‌కు 14 రోజుల రిమాండ్ విధించిన కోర్టు, మిగతా నలుగురికి బెయిల్‌ను మంజూరు చేసింది.

కారా పబ్‌పైనా కేసు..

ఇదిలా ఉండగా, అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా పబ్ నిర్వహించడంతో పాటు మద్యం సరఫరా చేసినట్లు గుర్తించిన జూబ్లీహిల్స్ పోలీసులు పబ్ యజమాని శశాంక్, మేనేజర్ హరీశ్‌పై ఐపీసీ 188, 290 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇంటర్ ఫెయిల్.. విద్యార్థి ఆత్మహత్య

సుల్తాన్‌బజార్, ఏప్రిల్ 25. ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ అయ్యానని మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి కథనం ప్రకారం.. సుల్తాన్‌బజార్‌కు చెందిన ఉదయ్ కిరణ్(17) ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. కాగా, బుధవారం విడుదలైన ఫలితాల్లో ఉదయ్ కిరణ్.. ఇంటర్ మొదటి సంవత్సరంలో నాలుగు సబ్జెక్టులలో ఫెయిల్ అయ్యాడు. దీంతో మనస్తాపానికి గురైన అతడిని తల్లిదండ్రులు సముదాయించారు. తప్పిపోయిన సబ్జెక్టులకు ఫీజు చెల్లించి, మరోసారి రాయమని సూచించారు. అయితే, గురువారం ఉదయ్‌కిరణ్ తల్లితో కలిసి చంపాపేటలోని తన కొత్త ఇంటికి షిఫ్టింగ్ కోసం వెళ్లాడు. బస్టాప్ వరకు వెళ్లిన అనంతరం తల్లితో తాను అద్దె ఇంటికి వెళుతానని చెప్పి, తిరిగి ఇంటికి వచ్చిన అతడు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసు కున్నాడు. సుల్తాన్ బజార్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరణిస్తూ జీవితాలనిచ్చారు..

ఖైరతాబాద్, ఏప్రిల్ 25 : వారు మరణించినా.. వారి అవయవాలతో మరి కొందరికి జీవితాలనిచ్చారు. రంగారెడ్డి జిల్లా, యాచారం మండలం గడ్డమల్లయ్యగూడెనికు చెందిన యార యాదగిరి (43) రైతు. ఈ నెల 19న ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఓ కుక్క అడ్డురావడంతో కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన యాదగిరిని ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖానలో చేర్పించారు. చికిత్స అందిస్తున్న వైద్యులు ఈ నెల 24న బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యులను కలిసిన జీవన్‌దాన్ ప్రతినిధులు అవయవదానం విశిష్టతను వివరించగా.. అందుకు వారు అంగీకరించారు. ఆయన శరీరం నుంచి గుండె, కాలేయం, రెండు మూత్రపిండాలు, కండ్లను సేకరించారు.

బైక్ పైనుంచి కిందపడి

ఏపీలోని కృష్ణా జిల్లాకు చెందిన సుంకర సులోచన (53) గృహిణి. ఈ నెల 21న ఆమె కుమారుడితో కలిసి బైకుపై వెళ్తుండగా బైక్ స్కిడ్ అయ్యింది. దీంతో కింద పడిపోయిన బాధితురాలికి తీవ్రగాయాలు కాగా, తొలుత ఖమ్మం జిల్లాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఫలితం లేకపోవడంతో సోమాజిగూడలోని యశోదకు తీసుకువచ్చారు. చికిత్స అందిస్తున్న వైద్యులు ఈ నెల 24న బ్రెయిన్ డెడ్‌కు గురైనట్లు నిర్ధారించారు. జీవన్‌దాన్ ప్రతినిధుల ఆమె కుటుంబ సభ్యులను కలిసి అవయవదానం విశిష్టతను వివరించడంతో ఒప్పుకున్నారు. దీంతో ఆమె శరీరం నుంచి కాలేయం, ఓ ఊపిరితిత్తి, రెండు మూత్రపిండాలు, నేత్రాలను సేకరించారు. అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులను జీవన్‌దాన్ అభినందించింది.

నగరంలో డ్రోన్లపై ఆంక్షలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధంకర్ దంపతుల పర్యటన నేపథ్యంలో శుక్రవారం సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని అల్వాల్, జీనోమ్ వ్యాలీతో పాటు మాదాపూర్ పోలీసు స్టేషన్ పరిసర ప్రాంతాల్లో రిమోట్ కంట్రోల్‌తో ఆపరేట్ చేసే డ్రోన్‌లను ఎగురవేయడం, పారా గ్లైడర్స్, మైక్రో లైట్ ఎయిర్‌క్రాఫ్ట్స్ వంటి వాటిని వినియోగించడంపై నిషేధం విధిస్తూ సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి ఆదేశాలు జారీ చేశారు. ఉప రాష్ట్రపతి దంపతులు అల్వాల్‌లోని జీనోమ్ వ్యాలీ, మాదాపూర్ ఠాణా పరిధిలోని వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొంటారు. భద్రత నేపథ్యంలో శుక్రవారం ఈ ప్రాంతాల్లో డ్రోన్ల ఎగురవేతపై ఆంక్షలు విధిస్తున్నట్లు సీపీ వివరించారు.

జంట కమిషనరేట్ల పరిధిలో ట్రాఫిక్ ఆంక్షలు..

ఉపరాష్ట్రపతి దంపతుల నగర పర్యటన సందర్భంగా హైదరాబాద్, సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఉప రాష్ట్రపతి దంపతులు బేగంపేట విమానాశ్రయం నుంచి పీఎన్‌టీ ఫ్లైఓవర్, రసూల్‌పురా, సిటీఓ, ప్లాజా ఎక్స్‌రోడ్, తివోలి ఎక్స్‌రోడ్స్, తుర్కపల్లి, సికింద్రాబాద్ క్లబ్ ఇన్ గేట్, కార్ఖాన, తిరుమలగిరి ఎక్స్‌రోడ్, లోతుకుంట, తెలంగాణ తల్లి విగ్రహం, అల్వాల్, అయ్యప్ప స్వామి టెంపుల్, బొల్లారం చెక్‌పోస్ట్, హకీంపేట వై జంక్షన్ నుంచి జీనోమ్ వ్యాలీకి చేరుకుంటారు. అక్కడ కార్యక్రమాన్ని ముగించుకుని తిరిగి, సాయంత్రం 5 గంటల సమయంలో అదే మార్గంలో రాజ్‌భవన్‌ను చేరుకుంటారు. రాత్రి 7.10 గంటలకు రాజ్‌భవన్ నుంచి వీవీ విగ్రహం, ఈనాడు, ఓల్డ్ కేసీపీ, అన్సారీ మంజిల్, తాజ్‌కృష్ణ జంక్షన్, ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్, ఎన్‌టీఆర్ భవన్ జంక్షన్, జూబ్లీ చెక్‌పోస్ట్, కేబుల్ బ్రిడ్జి మీదుగా మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ చేరుకుంటారు. అక్కడ కార్యక్రమాన్ని ముగించుకుని రాత్రి 8 గంటలకు తిరిగి అదే మార్గంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. ఉపరాష్ట్రపతి రాకపోకలు సాగించే మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించిన నేపథ్యంలో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని పోలీసులు సూచించారు.

బాధితురాలికి బంగారం, నగదు అప్పగింత

మాదన్నపేట, ఏప్రిల్ 25: ఆటోలో ఓ యువతి బంగారం, నగదు మరిచిపోయింది. పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఆటోను గుర్తించి నగలు, నగదు స్వాధీనం చేసుకొని బాధితురాలికి అప్పగించారు. ఈ ఘటన కాంచన్‌బాగ్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హఫీజ్‌బాబానగర్‌కు చెందిన యువతి బుధవారం సాయంత్రం బండ్లగూడకు వెళ్లింది. తిరిగి సాయంత్రం ఇంటికి ఆటోలో వచ్చింది. తొమ్మిది తులాల బంగారం నగలు, రూ.20 వేల నగదు ఉన్న బ్యాగును ఆమె ఆటోలోనే మరిచిపోయింది. బాధితురాలు వెంటనే కాంచన్‌బాగ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. యువతి ఇచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు.. ఆటో డ్రైవర్‌ను గుర్తించి, డ్రైవర్ వద్దనుంచి నగలు, నగదు స్వాధీనం చేసుకొని బాధితురాలికి అప్పగించారు. ఫిర్యాదు చేసిన 24 గంటల వ్యవధిలోనే పోలీసులు కేసును ఛేదించడంతో బాధితురాలు కృతజ్ఞతలు తెలిపారు.

ఈవ్ టీజింగ్.. ఎనిమిది రోజుల జైలు శిక్ష

అబిడ్స్, ఏప్రిల్ 25: ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న ఓ వ్యక్తిని మంగళ్‌హాట్ పోలీసులు అరెస్టు చేసి, అతడిని న్యాయస్థానం ముందు హాజరుపర్చారు. న్యాయస్థానం అతడికి ఎనిమిది రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ మహేశ్ గౌడ్ తెలిపారు. ఈ నెల 22న రహీంపురా ప్రాంతంలో అనిల్ (45) ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్నాడంటూ అదే ప్రాంతానికి చెందిన నవీన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు అనిల్‌ను అరెస్టు చేసి, న్యాయస్థానం ముందు హాజరుపర్చగా.. న్యాయమూర్తి అతడికి ఎనిమిది రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసును మంగళ్‌హాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మంగళ్‌హాట్ డీఐపై సస్పెన్షన్ వేటు

అబిడ్స్, ఏప్రిల్ 25: మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి సస్పెండ్‌కు గురయ్యారు. ఇటీవల ఆయన తన పుట్టిన రోజు వేడుకలను జూదరుల గృహంలో జరుపుకొన్నట్లు వచ్చిన ఆరోపణలతో విచారణ జరిపిన నగర పోలీస్ కమిషనర్.. అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. శాంతి భద్రతలను విస్మరించి, తన పుట్టిన రోజు వేడుకలను జూదం నిర్వహిస్తున్న స్థావరంలోనే జరుపుకొన్నట్లు ఫొటోలు, వీడియోలు వైరల్ కావడంతో విచారణ జరిపి, ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

యువకుడి ఆత్మహత్య

సుల్తాన్‌బజార్, ఏప్రిల్ 25: నిర్మాణంలో ఉన్న భవనంలో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం సుల్తాన్‌బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి కథనం ప్రకారం.. రాంకోఠిలో నిర్మాణంలో ఉన్న ఓ భవనంలోని బాత్‌రూమ్‌లో గుర్తుతెలియని ఓ యువకుడు (25) గీజర్ వాటర్ పైప్‌కు క్లాత్‌తో ఉరివేసుకున్నాడు. గురువారం దుర్వాసన రావడంతో అక్కడ పనిచేస్తున్న పాలక్ మండల్ గమనించి, బిల్డర్ సుధాకర్ రావుకు సమాచారమిచ్చాడు. పోలీసులు వచ్చి, బాత్‌రూమ్ తలుపులు పగులగొట్టి చూడగా, యువకుడు ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. పోలీసులు ఆ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడు నీలి-నలుపు రంగు చొక్కా, బ్లూ ట్రాక్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సుల్తాన్‌బజార్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఎవరికైనా యువకుడి వివరాలు తెలిస్తే సుల్తాన్‌బజార్ పీఎస్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

GOLD FINANCE

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-328121

PACKERS & MOVERS

★ Sri Sai Packers & Movers Local and all over India, Resonable Price. Head Office Nacharam: 27176927, Ameerpet: 9866379391, DSNR: 9666993927, KKP: 9949513929, MP: 9848263927, ECIL: 9666983927. NT-328125

PEST CONTROL

★చెదలు, బొద్దింకలు నివారణ: న్యూ కన్‌స్ట్రక్షన్ ట్రీట్‌మెంట్ 10 సంవత్సరాల గ్యారెంటీ మరియు శానిటైజర్ స్ప్రే కొరకు సంప్ర: 9392468282, 8333030227. NT-327882

OLD AGE HOME

★వృద్ధులు & భార్యాభర్తలు A/C & N/C అటాచ్డ్ బాత్‌రూమ్, మేడిపల్లి/ ఉప్పల్, వృద్ధులు, బెడ్ పేషెంట్లు, ECIL, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతి మరియు 24/7 మెడికల్ సర్వీస్. ఫోన్: 7981467036, 9391039990, 9515474083. NT-311886

TOURS & TRAVELS

★మహదేవ టూర్స్: చార్‌దామ్ యాత్ర 26 మే, దోదామ్ యాత్ర 10 మే, అమర్‌నాథ్ + నవదేవి యాత్ర 2 జులై, అమరనాథ్ + వైష్ణవి 7 జులై, ముక్తినాథ్ యాత్ర 11 జూన్ @ 9908844377. NT-311980

PLOT FOR SALE

★శ్రీశైలం హైవేలో 12 ఎకరాలు DTCP లేఅవుట్ LP No. వచ్చింది మార్కెటింగ్‌కు ఇవ్వబడును. అడ్వాన్స్ రూ॥లు కంపల్సరీ ఉంటుంది. 9177619716. NT-328320

★బీబీనగ